# అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమించా..


ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ రోడ్‌షోకు కదిలివచ్చిన ప్రజలు

- ప్రత్యేక ప్రణాళికతో ఖమ్మం మొత్తాన్ని ఒకే మాదిరిగా తీర్చిదిద్దా..
- అభివృద్ధి కాముకుడిని కాబట్టే కాలుకు బలపం కట్టుకొని తిరిగా..
- కష్టనష్టాల్లో తోడుగా నిలిచిందెవరో ఖమ్మం ప్రజలకు తెలుసు..
- సుఖదుఖ్ఖాల్లో ఏనాడూ లేని తుమ్మలకు ఖమ్మం ఓట్లు కావాలంట..
- నగర రోడ్ షోలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 18 : ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అహర్నిశలూ శ్రమించానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఖమ్మం మొత్తాన్ని ఒకే మాదిరిగా తీర్చిదిద్దానని స్పష్టం చేశారు. అభివృద్ధి కాముకుడిని కాబట్టే కాలుకు బలపం కట్టుకొని మరీ నగరంలో తిరిగానని అన్నారు. కష్టనష్టాల్లో తోడునీడగా నిలుచిందెవరో ఖమ్మం ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. ఖమ్మం ప్రజల సుఖదుఖ్ఖాల్లో ఏనాడూ లేని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం ప్రజల ఓట్లు కావాలంట అని విమర్శించారు. ఖమ్మం నగరంలో శనివారం పర్యటించిన ఆయన.. 16, 17, 27 డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు ఇన్నేళ్లలో ఏనాడైనా ఖమ్మం వైపుగానీ, అందులో ఉన్న శ్రీనివాసనగర్ వైపుగానీ కన్నెత్తయినా చూశారా? అని ప్రశ్నించారు. ఇక్కడి పెళ్లిలోనూ, చావులోనూ లేరని, మున్నేరు వరదలప్పుడూ లేరని, చివరికి కరోనా సమయంలోనూ కన్పించలేదని దుయ్యబట్టారు. ప్రజల సుఖదుఖ్ఖాల్లో ఏనాడూ కన్పించని తుమ్మలకు ఇప్పుడు ఖమ్మం ప్రజల ఓట్లు ఎందుకని ప్రశ్నించారు. 'పాలేరులో టికెట్ ఇవ్వలేదు కాబట్టి ఖమ్మంలో టికెట్ ఇవ్వాలంటడు. సత్తుపల్లిలో ఓడిపోతే ఖమ్మం వస్తాడు. ఖమ్మంలో ఓడిపోతే పాలేరు వెళ్తాడు. పాలేరులో ఓడిపోతే మళ్లీ ఖమ్మం వచ్చాడు..' అంటూ ధ్వజమెత్తారు. మట్టి తెచ్చేందుకైనా ఇంటోడు వెళ్లాలంటూ పెద్దలంటుంటారని గుర్తుచేశారు. ఆ ప్రకారమే ఖమ్మం ఇంటివాడినైన తనను మరోసారి ఆదరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్‌జేసీ కృష్ణ, ధనాల రాధ, పాలడుగు పాపారావు, రామకృష్ణ, ధనాల శ్రీకాంత్, నున్నా మాధవరావు, మెంతుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

# నేడు యువనేత పర్యటన

### నాలుగు నియోజకవర్గాల్లో రోడ్‌షోల్లో పాల్గొననున్న కేటీఆర్



ఖమ్మం, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం విస్తృతంగా పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉదయం నేరుగా భద్రాచలం పట్టణానికి చేరుకుంటారు. 11 గంటలకు శ్రీసీతారామ చంద్రస్వామిని దర్శించుకుంటారు. అనంతరం బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయాన్ని ఆకంక్షిస్తూ పట్టణంలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇల్లెందు పట్టణానికి చేరుకుంటారు. అక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్‌షో నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2:30 గంటలకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం చేరుకుంటారు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు అశ్వారావుపేటకు చేరుకుంటారు. అక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించిన కొద్ది రోజులకే మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారానికి వస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. కాగా, మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంత చేయాలని ఎమ్మెల్సీ తాతా మధు పార్టీ శ్రేణులకు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# తెలంగాణలోనే అద్భుత పథకాలు


జగ్గాయిగూడెం గ్రామంలో రేగాకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే..
- మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించి అభివృద్ధికి కొనసాగింపునివ్వాలి..
- ముఖ్యమంత్రి సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా.
- గుండాల మండల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాంతారావు

గుండాల, నవంబర్ 18: పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు పేర్కొన్నారు. తెలంగాణలో ఆయన రూపొందించి అమలు చేసిన అద్భుత పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించుకోవడం ద్వారా ఈ అభివృద్ధికి కొనసాగింపునివ్వాలని కోరారు. గుండాల మండలంలో శనివారం పర్యటించిన ఆయన.. కాచనపల్లి, మామకన్ను, ముత్తాపురం, గుండాల, లింగగూడెం, రోళ్లగడ్డ, శంబునిగూడెం, శెట్టుపల్లి గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహకారంతోనే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని అన్నారు. అన్ని మండలాల్లో బీటీ రోడ్లు, అంతర్గత రోడ్లు నిర్మించానని గుర్తుచేశారు. వాగులపై వంతెనలు నిర్మించి దూరాభారాన్ని తగ్గించానని, వాగులు పొంగి వరదలు వచ్చే సమయంలో ఇబ్బందులకు పరిష్కారం చూపానని అన్నారు. చడంతోపాటు ప్రజలకు దూరబారం తగ్గింది, ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించుకున్నమని వివరించారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే సంక్షేమ పథకాలు అందించే కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని గమనించి ప్రజలందరూ తనకు మరోసారి అవకాశమివ్వాలని కోరారు. ఈ సారి కూడా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ నెల 30న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎప్ నాయకులు, ప్రజాప్రతినిధులు తెల్లం భాస్కర్, గొగ్గెల రామయ్య, మంజుభార్గవి, మోకాళ్ల వీరస్వామి, టీ.రాము, సయ్యద్ అజ్జు, పొంబోయిన రమేశ్, నిట్ట రాములు, గడ్డం రమేశ్, వీరన్న, గొగ్గెల లక్ష్మీనారాయణ, వట్టం రవి, తాటి కృష్ణ, జాడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందులో గులాబీ జెండా ఎగరేద్దాం

- ఇక్కడి విజయాన్ని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం
- కామేపల్లి పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ
- కాంగ్రెస్ కంచుకోటలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం
- మాజీ మంత్రి రాంరెడ్డి స్వగ్రామంలో జననీరాజనం


హారతి పడుతున్న గిరిజన మహిళలు

కారేపల్లి (కామేపల్లి), నవంబర్ 18: ఇల్లెందు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరేద్దామని బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గంలో విజయం సాధించి దానిని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని అన్నారు. కామేపల్లి మండలంలో శనివారం పర్యటించిన ఆమె.. నెమలిపురి, పాత లింగాల, పింజరమడుగు, తాళ్లగూడెం, టేకులతండా, జాస్తిపల్లి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతీ ఒక్కరూ మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు భారీ మెజార్టీ అందించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే హరిప్రియ ఆయా గ్రామాల్లో కూలీలతో కలిసి కొద్దిసేపు పత్తి తీశారు. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ కంచుకోటలో బీఆర్ఎస్ ప్రచారం..**

అది కుగ్రామం. కానీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఆ గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా ఇతర పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహించిన దాఖలాలు లేవు. ఒకవేళ ఇతర పార్టీలు ఆ గ్రామానికి వచ్చినా గ్రామస్తుల నుంచి స్పందన ఉండదు. అదే మాజీ మంత్రి, దివంగత కాంగ్రెస్ నేత రాంరెడ్డి వెంకట్‌రెట్టి స్వగ్రామం పాత లింగాల. ఆ ఊరు మొత్తం కూడా గత ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీకి తప్ప మరి ఏ పార్టీలకూ ఓటు వేసిన దాఖలాలు లేవు. కానీ ఈసారి ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్ శనివారం తొలిసారిగా పాత లింగాలలో అడుగుపెట్టారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనికి గ్రామస్తులు కూడా నీరాజనం పలికారు. హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. మరికొందరు గ్రామస్తులైతే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం


చుంచుపల్లి మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా, చిత్రంలో బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ. జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ఎంపీపీ శాంతి, పార్టీ అధికార ప్రతినిధి జేవీఎస్ చౌదరి

- పనిచేసే బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించండి..
- పథకాలను విమర్శించే వారికి బుద్ధిచెప్పండి..
- చుంచుపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అందుకని మంచిగా పనిచేసే వారిని ఆదరించి గెలిపించాలని కోరారు. తద్వారా అభివృద్ధికి కొనసాగింపును అందించవచ్చునని అన్నారు. చుంచుపల్లి మండలంలో శనివారం పర్యటించిన ఆయన.. మండలంలోని విద్యానగర్, రాంనగర్, బాబూక్యాంపు, ఎన్‌కే నగర్, రామాంజనేయ కాలనీల్లో నిర్వహించిన రోడ్ షోల్లో మాట్లాడారు. నియోజకవర్గాన్ని తాను అన్ని విధాలా అభివృద్ధి చేశానని, తనను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉంటున్నారని అన్నారు. దళితులు, బీసీలు, మైనార్టీల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని అన్నారు. అంతటి మంచి పథకాలను విమర్శించే వారికి ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరూ అద్భుతమని కొనియాడుతున్న పథకాలను ప్రతిపక్షాలు విమర్శించడం వాటి ఓర్వలేని విధానానికి నిదర్శనమని విమర్శించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు. అలాగే, అన్ని కాలనీల్లోనూ ప్రజలు వనమాకు ఘన స్వాగతం పలికారు. జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం తథ్యమని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు బాదావత్ శాంతి, ఎడవల్లి కృష్ణ, జేవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.